క్లుప్తంగా

కళల కాణాచిగా గుడివాడకు పేరు



గుడివాడరూరల్: కళలకు కాణాచిగా గుడివాడకు పేరు ఉందని సీనియర్ కళాకారులు వంగా వంశీ, మల్లిక్ పేర్కొన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని కళా ప్రాంగణంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి విజయవాడ సౌజన్యంతో శ్రీరాజరాజేశ్వరి నాట్యమండలి గుడివాడ వారిచే బి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్య నాటకాన్ని గురువారం రాత్రి ప్రదర్శించారు. నాటకంలో ప్రధాన పాత్రదారులు పుప్పాల రంగారావు, బి.నాగలక్ష్మి, గంధం రాజేశ్వరి, ఎస్.కోటేశ్వరి, జి.శివకుమారి, బి.శోభారాణి ప్రేక్షకులను తమ ప్రదర్శనలతో అలరించారు.

వాహనాల రికార్డుల తనిఖీ

మండవల్లి: మండలంలోని లోకుమూడిలో ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు శుక్రవారం వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. మైనర్లు బండి నడుపుతూ ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హాకీ పోటీల్లో పమిడిముక్కలకు ప్రథమ స్థానం



పమిడిముక్కల: పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీలో 192 పాయింట్లు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం పొందారు. మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ రామారావు హెచ్ఎం దుర్గాభవానికి ఎక్సలెన్స్ స్పోర్ట్స్ అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఈటీ నారాయణను అభినందించారు.

నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

గుడివాడరూరల్: నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మండలంలోని చౌటపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత మద్యం, గుట్కా, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం జెడ్పీ పాఠశాల్లో ఎస్ఐ నిద్రించారు.

పేకాట శిబిరంపై దాడి

గుడివాడరూరల్: గుడివాడ రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబుకు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని పర్నాస గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. 23 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,72,000ల నగదు, 22 మొబైల్స్, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమాజానికి పంచ పరివర్తన అవసరం

కైకలూరు: సమాజంలో సామాజిక సమతుల్యత, పర్యావరణం, కుటుంబాల సఖ్యత, పౌర విధులు, గ్రామీణ వికాసం అనే పంచ పరివర్తనలు అవసరమని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భరత్‌జీ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్దికి చేరుకున్న సందర్భంగా లోకుమూడి దత్తాశ్రమంలో కైకలూరుశాఖ ఆధ్వర్యంలో పంచ పరివర్తన సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జంపన రామలింగరాజు, కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కూచిపూడి(మొవ్వ): మొవ్వలోని జయలక్ష్మి సీఫుడ్స్ (రొయ్యల) కంపెనీకి దగ్గరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. కూచిపూడి ఎస్ఐ కేవీఎస్ విశ్వనాథ్ కథనం మేరకు కూచిపూడి నుంచి చల్లపల్లి వెళ్లే రోడ్డులో కొడాలి వినోద్‌కుమార్ తన బైక్‌పై మొవ్వ వచ్చి తిరిగి ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం వచ్చి ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో వినోద్ రెండు చేతులు విరిగి గాయాలయ్యాయి. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి, టాటా ఏస్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

బుడమేరుపై వంతెన నిర్మించేది ఎప్పుడో?

- శిథిలావస్థలో పుట్టగుంట వంతెన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పుట్టగుంట వద్ద బుడమేరుపై రైలింగ్ లేకుండా ప్రమాదకరంగా మారిన వంతెన

గుడివాడరూరల్: వందలాది గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు బుడమేరుపై పుట్టగుంట గ్రామం వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన స్థానంలో మరో కొత్తది నిర్మించాలని పరిసర ప్రాంతాల ప్రజలు పాలకులు, అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఎన్నికల సమయంలో వంతెన నిర్మిస్తామని కూటమి నాయకులు హామీ ఇవ్వడమే కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ నీటి మూటగా మిగిలిపోయిందని విమర్శిస్తున్నారు.

ప్రమాదకరంగా వంతెన

తొమ్మిది దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన రైలింగ్ పూర్తిగా ధ్వంసమై రూపురేఖలు కోల్పోయింది. వంతెనపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఎంఎన్‌కే జాతీయ రహదారి ఈ వంతెన మీదుగా నిర్మించడంతో వందల సంఖ్యలో భారీ వాహనాలు నిత్యం వంతెనపై నుంచి వెళ్తుంటాయి. ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఒడిశా, కోల్‌కత్తాకు సైతం ఈ వంతెన ద్వారానే రవాణా సౌకర్యం ఉండటంతో వాహనాల రద్దీ అధికమైంది. ముఖ్యంగా నందివాడ, గుడివాడ ప్రాంతాల్లో ఆక్వా పరిశ్రమ అధికంగా ఉండటంతో చేపల మేత, చేపల ఎగుమతులు రోజువారీ జరుగుతూ ఉంటాయి. ఫలితంగా వాహనాల రాకపోకలతో వంతెనపై భారం అధికమైంది.

వరదలు వస్తే మునకే

బుడమేరు చిన్నపాటి వరదలకు సైతం పొంగిపొర్లుతుంది. వరద నీరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లోని మురుగు నీరు భారీగా వస్తుంది. దీని వలన పుట్టగుంట వద్ద బుడమేరు పొంగిపొర్లుతుంటుంది. ఇక్కడ నిర్మించిన వంతెన తక్కువ ఎత్తులో ఉండటంతో వరదల సమయంలో మునిగిపోతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. ఏడాది క్రితం బుడమేరుకు వచ్చిన భారీ వరదలతో ఈ వంతెన సుమారు నెలరోజుల పాటు ముంపులోనే ఉంది. దీంతో ఆ సమయంలో గుడివాడ నుంచి ఏలూరు, బుడమేరు పరివాహక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురైన విషయం తెలిసిందే.

ప్రజలకు శాపం

పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు పుట్టగుంట వంతెన శాపంలా మారింది. ఎన్నికలు వచ్చిన సమయంలో వంతెన నిర్మాణం చేపడతామని ఊదరగొట్టి ఉపన్యాసాలు చెప్పి తీరా గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు వంతెన ఊసే ఎత్తకుండా ముఖం చాటేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం వంతెన మరమ్మతులను సైతం అధికారులు గాలికి వదిలేశారు. ఇప్పటికైనా ప్రస్తుత పాలకులు వంతెన నిర్మాణంపై దృష్టిసారించి నూతనంగా వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.

ప్రయాణించాలంటే భయం



వంతెనకు ఇరువైపులా రైలింగ్ లేదు. దీంతో వంతెనపై ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది. వంతెనపైన రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. ఆదమరచి ప్రయాణిస్తే బుడమేరులో పడి ప్రాణాలు పోయే పరిస్థితి. వంతెనను నిర్మించాలని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. వంతెన నిర్మాణం చేపట్టాలి.

– శ్రీనివాసరావు, ఒద్దులమెరక

వరద వస్తే మునకే..



వంతెన ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షాల సమయంలో బుడమేరు పొంగి పొర్లుతోంది. వరదలు వస్తే వంతెన మునిగి రోజుల తరబడి బుడమేరు పరివాహక ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి. వంతెన నిర్మాణం చేపట్టి మా కష్టాలు తీర్చండి.

– భాస్కర్, వాహనచోదకుడు

నిమజ్జనోత్సవాల రేవుల పరిశీలన

గుడ్లవల్లేరు: మండలంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కాల్వల్లోని రేవులను తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ శుక్రవారం పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం రేవుల్లో లైటింగ్‌తో పాటు బారికేట్లను ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జన సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలను చేపట్టామని తహసీల్దార్ తెలిపారు. గుడ్లవల్లేరు మండల ప్రజలందరూ ముందుగా నిర్దేశించిన ప్రదేశాల్లో ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం ఇప్పించరూ..

పమిడిముక్కల: అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం ఇప్పించాలని లంకపల్లి ఎంపీటీసీ సభ్యుడు మీర్జా సజ్జాద్ అలీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు మీర్జా దియానత్ అలీ శుక్రవారం కోరారు. మండలంలోని అలీనఖీపాలెంలో గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా పంచాయతీ తీర్మానం ఇవ్వని పరిస్థితి నెలకొందని తెలిపారు.

ఈ విషయంపై సర్పంచ్, కార్యదర్శిని పలుమార్లు అడిగినా తీర్మానం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లగా తాను మాట్లాడి ఇప్పిస్తానన్నారని పేర్కొన్నారు. అయితే ఇంతవరకు తీర్మానం ఇవ్వలేదని, దీనిపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పంచాయితీ తీర్మానం ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సజ్జాద్ అలీ, దియానత్ అలీ కోరారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గుడ్లవల్లేరులో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదినారాయణ, ఉపాధ్యాయులు



పెంజెండ్రలో సాంస్కృతిక కార్యక్రమాలు

గుడ్లవల్లేరు: తెలుగు భాషా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు) ఆధ్వర్యంలో పాఠశాలలో తెలుగుతల్లి, రామ్మూర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాష వైభవానికి పునాదులు వేశారని హెచ్ఎం తెలిపారు.

పెంజెండ్రలో..

పెంజెండ్ర జిల్లా పరిషత్ హైస్కూల్లో మాతృ భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగాయి. హెచ్ఎం కె.మహాలక్ష్మి మాట్లాడుతూ తేట తెలుగు మనకు వరమన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్.వాసవి వ్యాఖ్యాతగా వ్యవహరించి పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడా దినోత్సవానికి ఉపాధ్యాయుడు కేఎల్ శ్రీనాథ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నాగబాబు, నాంచారమ్మ, ఆంజనేయరాజు, రత్నకుమారి, రాంబాబు పాల్గొన్నారు.

పెదసనగల్లు హైస్కూల్లో ..

పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం వీవీ సంజీవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

పమిడిముక్కల : తెలుగు భాషను పరిరక్షించుకోవాలని హెచ్ఎం ఫణికుమార్ తెలిపారు. పెనుమత్స ప్రాథమికోన్నత పాఠశాల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సుబ్బమ్మ, వేణుగోపాలరావు, సౌమ్య, వాణి, సుజాత పాల్గొన్నారు.

తెలుగు భాష తేనెలాంటిది

కైకలూరు: తెలుగు భాష తేనెలాంటిదని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, ప్రముఖ న్యాయవాది, కాలేజీ అభివృద్ధి కమిటీ సెక్రటరీ గురజాడ ఉదయ శంకర్ పేర్కొన్నారు. కాలేజీలో తెలుగు భాషా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదసనగల్లులో గిడుగు, ధ్యానచంద్ పటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో ప్రిన్సిపాల్

నేషనల్ స్కూల్లో..

కైకలూరు నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం జి.శ్రీనివాసరావు, పీడీ సురేంద్ర పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..


ముదినేపల్లి రూరల్: స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల్లో ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో గిడుగు జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాషపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.హరిత, అధ్యాపకులు ఓలేటి మణిబీమరాజు, బి.కృష్ణమోహన్, వీఎస్ విజయదుర్గ, జీఎస్‌వీ శివ పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గుడ్లవల్లేరు: భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ పాత్రికేయులు, యోగా గురు ముదిగొండ నాగ వీరభద్ర శాస్త్రి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎస్.ఎం అండ్ వి.వి ఆర్.ఎస్.ఆర్ ఇంగ్లిస్ మీడియం స్కూల్లో శుక్రవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు అమ్మ భాషను పట్టుదలగా నేర్చుకోవాలని వీరభద్ర శాస్త్రి సూచించారు. అనంతరం వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. వంద మంది తెలుగు రచయితల చిత్ర పటాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి ముదిగొండ శాస్త్రిని హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ కుంజుమన్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడరూరల్: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభకనబర్చి పలు పతకాలు సాధించారని బేతవోలు ఎస్‌జీవీఎస్‌జీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం సంధ్య తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన అండర్–14,16 అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు కె.పూజిత (డిస్కస్‌త్రోలో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో 2వస్థానం), 100 మీటర్ల రన్నింగ్‌లో కె.సంజన తృతీయస్థానం, లాంగ్‌జంప్‌లో పి.నందిని ద్వితీయస్థానం, డిస్కస్ త్రోలో ప్రశాంత్‌సాయి మొదటి స్థానం, ఎల్.ప్రేమ్‌కుమార్ ద్వితీయస్థానం, షార్ట్‌పుట్‌లో ఎం.అఖిల్‌బాబు 3వస్థానం, లాంగ్‌జంప్, 100మీటర్ల రన్నింగ్‌లో ఎస్.సాయికిరణ్ ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ సతీష్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించినట్లు హెచ్ఎం తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కొనసాగుతున్న చవితి వేడుకలు



గుడివాడ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో హేరంబ గణపతిగా దర్శనమిచ్చిన స్వామి



కొతవరంలో వర సిద్ధి వినాయకునికి పూజలు



కొత్తూరులో ట్రాక్టర్‌పై వినాయకుడి ఊరేగింపు

గుడివాడరూరల్: పట్టణంలో వినాయక చవితి వేడుకలు మూడో రోజు కొనసాగాయి. స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామి హేరంబ గణపతిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శాయన రాజేష్, ఆలయ ఈఓ యార్లగడ్డ వాసు, కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి పాల్గొన్నారు. స్థానిక లీలామహల్‌రోడ్డులోని చిన్నారులు ఏర్పాటు చేసిన బాల గణపతికి భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీరాంపురం పుల్లలపాడు వద్ద వేంచేసియున్న శ్రీబాలగణపతి ఆలయంలో స్వామికి వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, మండవల్లి, భైరవపట్నం, లోకుమూడి తదితర గ్రామాల్లో స్వామి వారి ఉత్సవాలు రమణీయంగా నిర్వహిస్తున్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని కౌతవరం సీతపేట శ్రీ వర సిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి వైఎస్సార్ సీపీ నేత బాడిగ భాస్కరరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మెట నాగేశ్వరరావు, తూము సూర్య నారాయణ, అర్చకుడు అంబా గౌతమేశ్వరరావు పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి ఐదో వార్డులో ఏర్పాటు చేసిన మందిరం వద్ద మహిళలు శుక్రవారం కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు మొవ్వ రామచంద్రరావు మంత్రోచ్చరణ మధ్య పూజను మహిళలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పావులూరి వెంకటేశ్వరరావుతోపాటు ఆ ప్రాంత పెద్దలు పర్యవేక్షించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: చవితి ఉత్సవాల్లో భాగంగా గుర్రాల్లంక ఏటీఎం సెంటర్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గుర్రాల్లంక ప్రాథమిక పాఠశాల ఎదురుగా బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహం ఆకట్టుకొంది. శనివారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బాలగణేష్ యూత్ తెలిపారు.

కొత్తూరులో ..

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం శివారు కొత్తూరులో వినాయ చవితి ఉత్సవం ముగింపు సందర్భంగా శుక్రవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పామర్రులో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ప్రత్యేక పూజలు

పామర్రు(మొవ్వ): పామర్రులోని విష్ణు ఆలయాన్ని, ఎన్టీఆర్ కాలనీలోని వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు

పెదపారుపూడి: వినాయకుని నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనునాయక్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఊరేగింపు సమయంలో గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ విమాదేవి , ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఏఎన్ఎం విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు: గుడివాడ నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులు బహుమతులను అందుకుని విజయఢంకా మోగించారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ కుంజుమన్ శుక్రవారం తెలిపారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నారన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమం, 200 మీటర్ల పరుగులో ద్వితీయం, జూనియర్ బాలుర డిస్కస్ త్రోలో తృతీయ బహుమతులను తమ విద్యార్థి వి.పీటర్సన్ గెలుచుకున్నాడని చెప్పారు. 200 మీటర్ల పరుగులో ప్రథమం, 100 మీటర్ల పరుగులో ద్వితీయం, షాట్ పుట్‌లో ద్వితీయం, లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతులను ఎ.లుక్మన్ గెలుచుకున్నాడని తెలిపారు. డి.యాస్మిత్ షాట్ పుట్‌లో ప్రథమం గెలుచుకున్నాడని పేర్కొన్నారు. కె.సాయి గోపాల్ సీనియర్ షాట్ పుట్‌లో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడని చెప్పారు. కె.ఇందుమతి జూనియర్ బాలికల డిస్కస్ త్రోలో తృతీయ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలతో పాటు పీఈటీ భూపాల్ రెడ్డిని స్కూల్ యాజమాన్యం అభినందించారు.



విజేతలతో పీఈటీ భూపాల్‌రెడ్డి

వ్యాపారులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కైకలూరు: చిన్న, మధ్యస్థ పరిశ్రమలు, పలు దుకాణాల స్థాపనకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీపీ అడవి కృష్ణ తెలిపారు. మండల పరిషత్ సమావేశ హాల్లో జిల్లా జనరల్ మేనేజర్, జిల్లా ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 70 మందికి ఉచిత రిజిస్ట్రేషన్లు శుక్రవారం నిర్వహించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జితేంద్ర, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కైకలూరు: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్రబాబు మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీస్ లిమిటెడ్, కోల్గేట్ తదితర 13 ప్రముఖ కంపెనీల ఇంటర్వ్యూలకు 154 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 65 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలను శనివారం తొలగించనుండడంతో వరహాపట్నం ఫీడర్‌కు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ నివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.